22.8.1997 శుక్రవారం 12 పేజీలు సంపుటి:69 సంచిక:34 విడిప్రతి రూ.2.00లు Phone: 327354 Regd. No. HNL 18

# జమీన్ రైతు

స్థాపకుడు: నెల్లూరు వెంకట్రామానాయుడు జీవప్రదాత: నెల్లూరు శ్రీరామమూర్తి




# జన్మభూమి దగాభూమిగా మారింది!

తివిరి ఇసుమున తైలంబు తీయగల ఘనులు మన రాజకీయ నాయకులు; జన్మభూమి పథకం వారికొక లెక్క పక్కా? జనాకర్షణ లేని తాను జనంలో అభిమానం సృష్టించుకోవడానికి నానా తంటాలు పడి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించిన జన్మభూమి పథకం తెలుగు నేతలకు చక్కని పాడియావు వలె పనికి వస్తున్నది; జనం మూతులు బిగియకట్టి, చెవుల్లో పువ్వులు తురిమి దాని నుంచి కావలసినంత డబ్బు పిండుకొంటున్నారు. ఇది వారికి రెండరకాల లాభంగా వుంది. పనులు జరిపిస్తున్నామన్న పేరుకు పేరు - పైసలకు తడుముకోవాల్సిన అగత్యం ఏర్పడకుండా నిరంతరాయంగా నికరాదాయం.

30 శాతం శ్రమదానం చేయడానికి ముందుకు వస్తే - టెండర్లు గిండర్లు లేకుండా తతిమా 70 శాతం విలువకు నిధులు మంజూరు చేయడం జన్మభూమి పథకం. ప్రజలు తమంతట తాముగా పనులు జరిపించు కొంటారన్నది దీని వుద్దేశ్యం; కాంట్రాక్టర్ల వ్యవస్థను ప్రక్కకు తప్పించడం లక్ష్యం. అయితే ఆచరణలో అవి రెండూ జరగడం లేదు. ఇటు రాజకీయ నాయకులకు, అటు కాంట్రాక్టర్లకు పండుగగా వుంది దీనితో!

**ఆత్మకూరులో ఎమ్మెల్యే ఇచ్చే చిత్తుకాగితాలే ఎస్టిమేషన్లవుతున్నాయి; కాంట్రాక్టర్లు ప్రతి చోటా చవకగా పనులు కొట్టేసి లాభపడుతున్నారు!**

సాధారణంగా ఒక కాలువ త్రవ్వాలన్నా, రోడ్డు వేయాలన్నా టెండర్లు పిలిస్తే - ఎస్టిమేషన్ ధరకంటే కాంట్రాక్టర్లు 10 నుంచి 20 శాతానికి తగ్గించి ఆర్డర్ ఇస్తుంటారు. టెండరుతో పాటు వారు 1 శాతం ఇఎండి కట్టాలి; బిల్లులో రెండు శాతం ఆదాయం పన్ను మినహాయిస్తారు; సేల్స్‌టాక్స్ వుండే పనులకు అది అదనం; టెండరు సమయం నుంచి ఫైనల్ బిల్లు తయారయ్యే లోపల వివిధ స్థాయిలలో కనీసం 10 శాతం లంచాల ఖర్చు వుంటుంది. ముందుగా పెట్టిన పెట్టుబడికి బిల్లు వచ్చేలోపల వడ్డీ లెక్కేస్తే - అదొక ఆరేడు శాతం అవుతుంది. ఈ ఖర్చులన్నీ పోను కాంట్రాక్టరుకు నికరంగా చేతికి వచ్చే మొత్తం ఎప్పుడూ 70 శాతం మించదు. అందులో పనికి 50 శాతం ఖర్చు చేసి తన లాభంగా 20 శాతం మిగుల్చుకొంటారు. ఇది సాధారణ విషయం. మట్టి పనుల్లో అయితే లాభం ఇంకొంచెం అదనంగా వుంటుంది.

ఈ నేపథ్యంలో జన్మభూమి క్రింద 70 శాతం నిధులు వస్తే - టెండరు గొడవలు, లంచాలు, ట్యాక్సులు లేవు కాబట్టి కాంట్రాక్టరుకు నికరంగా వ్యాపారం జరుగుతుంది. దానితో వారు జన్మభూమి పనులకు ఎగబడుతున్నారు. వారు నేరుగా అడిగితే అధికార్లు పట్టించుకోరు కాబట్టి ఎవరో ఒక ఎమ్మెల్యేను ఆశ్రయిస్తున్నారు.

ఎమ్మెల్యేలు, కౌన్సిలర్లు తదితరులకు ఇది మంచి లాభసాటి వ్యాపారం. వీధిలో రోడ్డు వేయాలన్నా, కాలువ త్రవ్వాలన్నా ఆ ప్రాంతం ప్రజల నుంచి విరాళాల రూపంలో 30 శాతం నిధులు దండుతున్నారు. రోడ్డు అయితే ఇంటికి ఇంత అని, కాలువలైతే ఎకరాకు ఇంత అని నిర్ణయించి వసూలు చేస్తున్నారు. ఈ దండకం పనికి కాంట్రాక్టర్ బాధ్యత తీసుకొని; ఆ మొత్తం ఎమ్మెల్యేకు అప్పచెప్తున్నారు. అది వారికి పుట్ట పుడియంగా వచ్చే లాభం. పని చేయించామన్న ప్రచారం, లేని ప్రారంభానికి జరిగే సభ ఫోటోలు పత్రికల్లో రావడం వారికి బోనస్ క్రింద లెక్క. చాలా హ్యాపీగా, ఉత్సాహంగా, అదే పనిగా జన్మభూమి పనులు జరిపించడంలో అసలు ట్రిక్కు ఇదే!

నెల్లూరు జిల్లాకు సంబంధించి ఆత్మకూరు నియోజకవర్గంలో కోట్లాది రూపాయల జన్మభూమి పనులు అమలు జరుగుతున్నాయి. ఎమ్మెల్యే లక్ష్మయ్య నాయుడు గారు హూరూరా పనులు ముమ్మరంగా జరిపిస్తున్నారు. పల్లెటూళ్లలోనూ సిమెంట్ రోడ్లు ఏర్పడుతున్నాయి. అయితే ఆయన పెద్దగా ప్రజల నుంచి విరాళాలు దండించడం లేదు. ఏ పనికి ఎంత ఎస్టిమేషన్ వేయాలో చిన్న స్లిప్ ఇచ్చి, ఇంజనీర్లను మొట్టి బిల్లులు

కొరవ 7 పేజీలో

INTRODUCING
TANISHQ FROM TITAN



The Jewellery of the Future
over 300 Designs
from Rs.800/– onwards

TITAN TANISHQ Precious jewellery by TITAN TIMEX QUARTZ

నెల్లూరు వాసుల్లారా!
మీ ఊరికి
"వరల్డ్ ఆఫ్ టైటన్"
వచ్చేసింది!

మీ కిష్టమైన ప్రియమైన టైటన్ గడియారాలను ఇక అక్కడ, ఇక్కడ కొనుగోలు చేయనక్కరలేదు. మీ కొరకే వెలసిన "వరల్డ్ ఆఫ్ టైటన్" విశిష్టషోరూమ్‌లోనే కొనుకోవచ్చు ఇది భారతదేశపు అతిపెద్ద షోరూమ్. అందుకే మరి ఇక్కడ మీకు ఎంచుకునేందుకు టైటన్/టైమెక్స్/తనిష్క్ గడియారాలు మరియు క్లాకుల బ్రహ్మాండమైన శ్రేణి ఉంటుంది. ఇంతేకాదు. ఎదురు చూడని కానుకలు కూడా మీరు గెలుచుకోవచ్చు ఈ కానుకల సమర్పణ ఆగస్టు 21 నుండి 28 వరకు మాత్రమే.

THE WORLD OF TITAN
16/245, ట్రంకురోడ్డు, నెల్లూరు- 524 001. ఫోన్ : 325148.

UNIVERSAL

# సణుగుడు

## * జెకె. మాదాసు నేతృత్వంలో అసమ్మతి 'సిపాయిల తిరుగుబాటు'

జిల్లా కాంగ్రెస్‌లో స్వాతంత్ర్య స్వర్ణోత్సవ దినాన మువ్వన్నెల జెండాతో పాటు, తిరుగుబాటు పతాకమూ ఎగిరింది. జిల్లా రాజకీయాలకు దూరంగా, ప్రవాస జీవితం గడుపుతున్న మాజీ ఎమ్మెల్యే జెకె రెడ్డి విప్లవ శంఖం పూదాడు. వెంకటగిరి అందుకు వేదిక.

**ద్రోణేంద్ర**

సర్వ సైన్యాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్సీ మాదాసు గంగాధరం.

జిల్లా రాజకీయాలలో ఈ మధ్య జెకె, మాదాసు చెట్టపట్టా లేసుకొని, చిటపట చినుకుల పాట పాడుతున్నారు. వీరిద్దరి స్నేహం ఎంత ఘాటైనదో నాకు తెలియదు కాని – వీరిద్దరికి జనార్దన రెడ్డితో ఉమ్మడి శతృత్వం మాత్రం ప్రగాఢమైనది. శత్రువు శత్రువు మిత్రుడనే సిద్ధాంతంతో ఇద్దరూ కలిసి కాపురం చేస్తున్నట్లున్నారు.

జనార్దన రెడ్డి జాతకమేందో గాని, గత పాతికేళ్లలో ఎప్పుడూ ఎవరో ఒక శత్రువు ఆయనతో సమరం చేస్తూనే వుంటారు. నల్లపరెడ్డి శ్రీనివాసులు రెడ్డి బ్రతికినంత కాలం ఎత్తిన కత్తి దించలేదు. వారిద్దరి మధ్య పేచీ వచ్చేటప్పటికి జనార్దన రెడ్డి రాజకీయ బాలుడు; శీనయ్య ప్రకటనలు, పిటీషన్లు ఆయన్ను రాజకీయాలలో రాటుదేల్చాయి. ఎప్పుడూ మెడ మీద కత్తి వుండబట్టే కాబోలు – రాజకీయాన్నే కవచంగా మార్చుకొని బ్రతకడం నేర్చుకున్నారు. శీనయ్య ఒత్తిడి లేకుంటే, పదేపదే తరమకుంటే జనార్దన రెడ్డి ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగేవాడు కాదేమోనని నా సందేహం. ఆ అవసరం ఆయన్ను నాయకుడిగా పెంచింది. ఆ తర్వాత కొద్దికాలం మాగుంట సుబ్బరామ రెడ్డి, శీనయ్య లోటు పూడ్చారు. అయితే సుబ్బరామ రెడ్డి గారిది – రాజకీయ శతృత్వం, వ్యక్తిగత మిత్రత్వం; అక్కడ తిట్టి అక్కడ ఇంటికి వెళ్లి దండం పెట్టి వచ్చేవారు.

శీనయ్యది ఒంటరి పోరాటం; ఆయన అసహాయ శూరుడు; తన వెంట ఎవరున్నా రనేది చూచేవాడు కాదు, వెంట ఎవరో రావాలని ఎదురు చూసేవాడూ కాదు. గంతలు కట్టిన గుర్రం నడక వలె వుండేది పోరాటం. అంతటి సామర్థ్యం జెకె, మాదాసు ద్వయానికి వుందా అన్నది సందేహం.

కాని ఇప్పటి వరకు ఆయనకు అతిరధ, మహారధు లెవ్వరు దొరకలేదు; కేవలం సిపాయిలు లభించారు. బుదాటి రాధయ్య, కోటంరెడ్డి శ్రీధర రెడ్డి, కాసా గురవయ్య, అర్ధనారీశ్వర రూపంలో పూటుకూరు ఆదిమూర్తి... ఇట్లా అందరూ సైనికులే! అందువల్లే వెంకటగిరి సభ అసమ్మతి సిపాయిల తిరుగుబాటును తలపింప జేసింది. ఎప్పుడో నూటనలభై ఏళ్ల క్రితం (1857) మనమే కాదు – మన తాతలూ పుట్టక పూర్వం బ్రిటీషు దొరతనంపై సిపాయిలు తిరగ బడ్డారట. అది స్వాతంత్ర్యోద్యమానికి నాంది. తర్వాత అతిరధ, మహారధులతో సమరం సాగించి విజయం సాధించ డానికి, 1947 వరకు - 90 ఏళ్లు పట్టింది. అంత సుదీర్ఘ పోరాటం చేయడానికి జెకెకు ఓపిక వుంటుందా? తొమ్మిది నెలల్లో పార్లమెంట్ ఎన్నికలు, పందొమ్మిది నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు వున్నాయి. చాలా త్వరపడాలి.

కాని కలిసి వచ్చేదెవరు? అప్పటి కిప్పుడు అంత సాహసం చేసి వారెవరూ కన్పించడం లేదు. అందరి ఆశ, భయం అసెంబ్లీ టిక్కెట్లు! ఆ సమయానికి ఢిల్లీలో సందిని పందివి చేసి జనార్దన రెడ్డి తన చిట్టాపైనే అధిష్టానం దస్కతు వేయిస్తాడన్నది చరిత్ర. అది తెలిసిన వారెవ్వరూ పేచీకి దిగరు. పైగా వీరిద్దరి వల్ల మరెవ్వరికీ వ్యక్తిగత పేచీలు, కష్టాలు లేవు. పేచీ పెట్టుకొంటే టిక్కెట్ రిస్కులో పడుతుంది. దాన్ని అప్పించ గల తాహతు జెకెకి వున్నదన్న విశ్వాసం కల్గే వరకు ఎవరూ ముందుకు రారు.

జెకె సాత్వికుడు; సీరియస్‌నెస్ లేని లైట్ హార్ట్ పొలిటీషియన్; పదవులపై పెద్దగా ఆశలూ లేవు; అందుకు పోరాడి సాధించాలన్న పట్టుదల ఎప్పుడూ లేదు; ఇస్తానన్న అసెంబ్లీ టిక్కెట్‌ను వద్దని వ్రాసిచ్చిన పెద్దమనిషి. అందుకు ఏ క్షణంలోనూ బాధపడని తత్వం; ఏవో వ్యక్తిగత కారణాలు, కోపాలు మనసులో పెట్టుకొని లేనిపోని న్యూసెన్స్ తలకెత్తు కోవడం అవసరమా? ఆలోచించండి సార్!


## కావలిలో ఇల్లు అమ్మబడును

కావలి జనతాపేటలో డోర్ నెం.9-25-60లో 102 అంకణాల స్థలంలో 30 అంకణాల కట్టుబడి కల్గిన రెండు అంతస్తుల మిద్దె ఇల్లు, అన్ని వసతులు కల్గినది అమ్మబడును. వివరాలకు

కె. శ్రీనివాసులు

1-3-37, శివాలయం వీధి, కావలి-524 201 ఫోన్: 41766


## జన్మభూమి

1వ పేజీ తరువాయి

చేయిస్తున్నారు. ఫలితంగా పనుల ఎస్టిమేషన్లు పెరిగిపోయి, కష్టపడకుండా లాభం చేతికి వచ్చేస్తున్నది. ఇప్పటికి దాదాపు 30 కోట్ల రూపాయల పనులు ఈ రీతిలో జరిపించి వుంటారని అంచనా. చాలా పనులు పూర్తి చేసి, ఆ తర్వాత మంజూరు తెప్పిస్తున్నారట. జిల్లా అధికార యంత్రాంగం ఆయన మాటను శిలాశాసనంగా భావిస్తున్నది; ఎదురు చెప్పే ధైర్యం ఎవరికీ లేదు; ఆయన ఇచ్చే చిత్తు కాగితాలే పనులకు ఎస్టిమేషన్లుగా మారుతున్నాయి.

## నెల్లూరుముచ్చట్లు

6 వ పేజీ తరువాయి

### కెపి. నారాయణరావు హఠాన్మరణం

రిటైర్డ్ జిల్లా జడ్జి.

సాహిత్యాభిమాని, న్యాయకోవిదుడు శ్రీ కెపి నారాయణరావు 21 తేది సాయంత్రం హఠాత్తుగా హృద్రోగంతో మరణించారు. ఆయన వయస్సు 72 సంవత్సరాలు. నారాయణరావు విశిష్ట వ్యక్తి; బహుముఖ ప్రజ్ఞాశాలి. ప్రఖ్యాత న్యాయవాది ఖాసా సుబ్బారావు గారి వద్ద న్యాయవాద వృత్తి అభ్యసించా రాయన. కొంత కాలం హైకోర్టులో ప్రభుత్వ ప్లీడరుగా వుండినారు. తర్వాత జడ్జిగా వెళ్లారు. 1983లో రిటైరైనారు. న్యాయ శాస్త్రం ఆయనకు కంఠోపాఠం. రెఫరెన్స్ అవసరం లేదు. చక్కటి ఉపన్యాసకుడు; సంగీత పిపాసి; వీణ చాలా బాగా వాయించేవారు; సాహిత్యాభి మాని; ఆయన తాత చింతామణి నాటక రచయిత. ఆ వైదుష్యం ఆయనకు అబ్బింది.

నారాయణ రావు గారికి ఇద్దరు కుమారులు; వారిలో ఒకరు హైదరాబాద్‌లో అడిషనల్ జిల్లా జడ్జి, కోడలు లాలో డాక్టరేట్ చేశారు. సరస్వతి కుటుంబం వారిది. వారికి మా సానుభూతి.

## శ్రద్ధాంజలి



### లేబాకుల వెంకటసుబ్బమ్మగారు

21.8.1997 తేది గురువారం స్వర్గస్థులైనారు.
వారి పవిత్రాత్మకు చిరశాంతిని కలుగజేయమని
భగవంతుని ప్రార్థిస్తూ శ్రద్ధాంజలి ఘటిస్తున్నాము.

**పెద్దకర్మ**

30.8.1997 తేది శనివారం
26/525, 3వ వీధి, పోస్టల్ కాలనీ, నెల్లూరులోని
మా గృహమున జరుగును. బంధుమిత్రులు తెలియ గోరుతాము.

కుమార్తె – అల్లుడు

**దేవిరెడ్డి నీరజమ్మ – సుధీర్‌కుమార్ రెడ్డి**

మరియు కుటుంబ సభ్యులు

